క్లుప్తంగా

వైభవంగా హరేరామ హరేకృష్ణ సంకీర్తన



సంకీర్తనలు చేస్తున్న భక్తులు

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో కార్తీక మాసం పురస్కరించుకొని గ్రామస్తులు హరేరామ హరేకృష్ణ సంకీర్తన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం తెల్లవారుజామున గ్రామస్తులు హనుమాన్ దేవాలయం నుంచి గ్రామంలోని వీధుల గుండా హరేరామ హరేకృష్ణ సంకీర్తనలను చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

చేగూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ విఠల్

నందిగామ: అధికారంలోకి వచ్చిన కేవలం 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి 11 నెలలు ముగుస్తున్నా నేటివరకు హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని చేగూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ మామిళ్ల విఠల్ ముదిరాజ్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఆచరణకు సాధ్యం కానీ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హామీల అమలు, అభివృద్ధి పనులు పక్కన పెట్టి బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి పాల్పడిందని ఆరోపించడం సిగ్గుచేటని విమర్శించారు. రైతు రుణమాఫీ, పింఛన్ల పెంపు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలు ఏమయ్యాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా సామూహిక యజ్ఞాలు



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని సింగాపురంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న మరకత కార్యసిద్ధి పంచముఖ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా శనివారం సామూహిక యజ్ఞ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సుమారు 100 జంటలు యజ్ఞంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితుల నుంచి ఆశీర్వచనాలు అందుకున్నారు. మధ్యాహ్నం భారతి తీర్థ అవార్డు గ్రహీతలు బ్రహ్మశ్రీ బంగారయ్యశర్మ, డా.నోరి నారాయణమూర్తి ప్రవచనాలు చెప్పారు. ఆదివారం ఉదయం మరకత పంచముఖ హనుమాన్ విగ్రహ, జయస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు..

బీరప్ప జాతరకు ఆహ్వానం



ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కురుమ సంఘం నాయకులు

షాబాద్: హైతాబాద్‌లో నిర్వహించే బీరప్ప జాతరకు ముఖ్య అతిథులు హాజరు కావాలని కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానందం అన్నారు. శనివారం నగరంలో ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల ఐలయ్యను కలిశారు. ఈనెల 18వ తేదీన మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో జరిగే బీరప్ప జాతరకు హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైతాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప జాతరను విజయవంతం చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కురుమ సంఘం సహాయ కార్యదర్శి సూద యాదయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు రాపోల్ నర్సింహులు, సలహాదారులు ప్రభాకర్, కుమార్, నందు, శివ, అనిల్, తదితరులు ఉన్నారు.

గోశాలకు విరాళం

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలోని గోశాలకు భక్తులు విరాళం అందజేశారు. పట్టణానికి చెందిన దుర్గాప్రసాద్, స్పందన దంపతులు రూ.11వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. గోవుల సంరక్షణకు విరాళం అందించినట్లు దాతలు తెలిపారు. కార్యక్రమంలో కానుగు అంతయ్య, రఘుగౌడ్, రమేశ్, రఘునందన్‌రెడ్డి, క్యూసెట్ శ్రీనివాస్, లక్ష్మణ్, కిషన్ నాయక్, రాఘవేందర్, నారాయణ, కృష్ణయ్య, లక్ష్మికాంత్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే షురూ

- ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు
- ఆస్తులు, వాహనాల వివరాలు ఇచ్చేందుకు వెనుకాడుతున్న ప్రజలు
- పర్యవేక్షించిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు
- తొలిరోజు మందకొడిగా సాగిన కులగణన ప్రక్రియ



చేవెళ్ల: అల్లవాడలో వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు

సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. 6వ తేదీ నుంచి మూడురోజుల పాటు వారికి కేటాయించిన ఇళ్లకు స్టిక్కర్లు వేసిన ఎన్యుమరేటర్లు శనివారం పూర్తిస్థాయిలో సమాచార సేకరణకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రశ్నావళికి కుటుంబాల నుంచి సమాధానాలు కోరుతూ వివరాలు సేకరిస్తున్నారు. కానీ ఇందులో ఆస్తులు, వాహనాలు తదితర వాటికి వివరాలు చెప్పేందుకు ప్రజలు నిరాకరిస్తున్నారు. ఈ సర్వే ప్రక్రియను అధికారులు ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నారు.

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే(ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే) శనివారం ప్రారంభమైంది.స్టిక్కర్ల ప్రక్రియ అనంతరం.. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం ఇచ్చిన ప్రశ్నావళితో కుటుంబ యజమానుల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఆస్తి విలువలు, భూమి పాస్ పుస్తకాలతో పాటు వాహనాలు, కార్లు, ఇతర వివరాలను సేకరిస్తూ ఎన్యుమరేటర్లు కులగణన పత్రంలో నిక్షిప్తం చేస్తున్నారు. కానీ గ్రామాల్లో కులగణన చేస్తున్న ఉద్యోగులకు కుటుంబ సభ్యులు పూర్తి వివరాలు చెప్పడానికి సందిగ్ధ పడుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్యుమరేటర్లు శనివారం ఇంటింటికీ సర్వే ఫారంలతో వెళ్లి వారి కుటుంబ వివరాలను సేకరించారు. ఒక ఫారంలో 75 ప్రశ్నలు వాటికి సంబంధించిన కోడ్‌లను ఫారంలో నింపాల్సి ఉండటంతో ఎన్యుమరేటర్లు ప్రారంభంలో నిదానంగానే కొనసాగించారు. పలువురు పలు సందేహాలు ఉండటంతో వాటిని మండల సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నారు. కానీ ప్రజలు మాత్రం ఈ సర్వేలో అడిగే కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి వెనుకాడారు. దీనిపై సర్వే సిబ్బంది నచ్చజెప్పి వివరాలు సేకరించారు. చేవెళ్ల మండలంలోని అల్లవాడలో ఎంపీడీఓ హిమబిందు, న్యాలట గ్రామంలో ఎంపీఓ విఠలేశ్వర్‌జీలు సర్వేను పరిశీలించి సర్వేలో వివరాల సేకరణను పలు కుటుంబాల వద్ద ఉండి పర్యవేక్షించారు. మొదటిరోజు మండలంలో 645 కుటుంబాలకు సంబంధించిన వివరాలను సేకరించినట్లు తెలిపారు. మొదటిరోజు కావటంతో ఫామ్‌లలోని ఒక్కో అంశాన్ని చదివి వారి నుంచి వివరాలు సేకరించేందుకు కనీసం 40 నిమిషాలకు పైగానే సమయం పట్టిందన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా సహకరించాలని కోరారు.

ఇంటింటికీ వెళ్లి..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని చిన్నమంగళారంలో మండల విద్యాధికారి వెంకటయ్య అధికారులతో కలిసి పర్యటించారు. కేతిరెడ్డిపల్లిలో పంచాయతీ కార్యదర్శి తారాబాయి సర్వేలో పాల్గొని తోటి ఉద్యోగులతో ఇంటింటికీ వెళ్లి పూర్తి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శివకుమార్, తారాబాయి, అంగన్‌వాడీ టీచర్లు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

సక్రమంగా నిర్వహించాలి

ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణనను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ సూచించారు. శనివారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో కులగణన సర్వే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కులగణన నిర్వహిస్తున్న అధికారులతో వివిధ ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. అజీజ్‌నగర్ పోలింగ్ కేంద్రాలు 144, 145, 146, 147, 148లలో ఎలాంటి తప్పులు ఉన్నా సక్రమంగా చేసి తప్పులు లేకుండా చూడాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్, మండల ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల సూపరింటెండెంట్ రెహమాన్, రేషన్‌డీలర్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామ: మండల కేంద్రమైన నందిగామతో పాటు మరో 18 గ్రామ పంచాయతీల్లో శనివారం సమగ్ర కుటుంబ సర్వేను అధికారులు ప్రారంభించారు.మండలంలోని 19 గ్రామ పంచాయితీలలో 9,785 ఇళ్లు ఉండగా, 92 బ్లాకులు, 89 మంది ఎన్యుమలేటర్లు, 10 మంది సూపర్‌వైజర్లు సర్వేను నిర్వహిస్తున్నారు. నందిగామలో కొనసాగుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను మండల ప్రత్యేక అధికారి సుధాకర్ స్థానిక ఎంపీడీఓ సుమతితో కలిసి పరిశీలించారు.

మొదటిరోజు వడివడిగా..

కొత్తూరు: సమగ్ర కుటుంబ సర్వే మండలంతో పాటు మున్సిపాలిటీలో శనివారం ప్రారంభమైంది. మండలంలోని 12 పంచాయతీల్లో సర్వే తీరును మండల ప్రత్యేకాధికారి లీనా, మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ బాలాజీలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉన్నతాధికారుల సూచన మేరకు సర్వే ఫారంలో ఉన్న వివరాల నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా వారు ఎన్యుమరేటర్లకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కాగా సర్వే ఫారంలో మొత్తం 72 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను నమోదు చేయాల్సి ఉండడంతో ఒక ఫారం పూర్తి చేయడానికి సుమారు 30 నిమిషాల సమయం పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. మొదటిరోజు కావడంతో ఎన్యుమరేటర్లు సైతం కొద్దిగా నెమ్మదిగా ఫారాల్లో వివరాలు నమోదు చేయడానికి ఇబ్బంది పడ్డారు.

పారదర్శకంగా నిర్వహించాలి

కొందుర్గు: సమగ్ర కుటుంబ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్యుమరేటర్లు చేస్తున్న సమగ్ర సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సర్వే ఆధారంగానే భవిష్యత్‌లో ప్రభుత్వం అందించే పథకాలు పేదలకు అందుతాయన్నారు. ఇందుకు ప్రజలు తమ సిబ్బందికి సహకరించి పూర్తి వివరాలు తెలపాలని సూచించారు.



కొత్తూరు: మున్సిపాలిటీలో సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ బాలాజీ



కొందుర్గు: సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

ప్రతీ ఇంటికి చేయాల్సిందే



షాబాద్: మద్దూరులో సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీఓ అపర్ణ

షాబాద్: కులగణన సర్వేలో ప్రతీ కుటుంబ నుంచి సంపూర్ణ సమాచారం సేకరిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని సోలీపేట్, మద్దూరు, నాగర్‌కుంట, ముద్దెంగూడ, కేశవగూడ గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సర్వే ద్వారా ప్రజల స్థితిగతులు తెలిసి ప్రభుత్వ పథకాల అమలుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవడానికి దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం చూపిన మార్గదర్శకాల ఫార్మెట్‌లో సామాజిక, ఆర్థిక, ఉద్యోగ రాజకీయ సమాచారంతో పాటు కుల సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. ప్రతీ కుటుంబ పరిస్థితి ఆధారంగా ఏ సంక్షేమ పథకానికి ఏ కుటుంబం అర్హులో గుర్తించడం సులభతరమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మొయినాబాద్‌రూరల్: కేతిరెడ్డిపల్లిలో ఇంటి యజమాని నుంచి వివరాలు సేకరిస్తున్న పంచాయతీ కార్యదర్శి తారాబాయి



నందిగామ: నందిగామలో సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి సుధాకర్, ఎంపీడీఓ సుమతి



మొయినాబాద్‌రూరల్: అజీజ్‌నగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రకళ

గోమాత సకల దేవతలతో సమానం

వీహెచ్‌పీ విభాగ్ సహ కార్యదర్శి మఠం రాచయ్య



గోపాష్టమి వేడుకల్లో పాల్గొన్న వీహెచ్‌పీ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: గోవులను పూజిస్తే సకల దేవతా మూర్తులను పూజించిన పుణ్యఫలం లభిస్తుందని విశ్వహిందూ పరిషత్ విభాగ్ సహ కార్యదర్శి మఠం రాచయ్య అన్నారు. శనివారం పట్టణ సమీపంలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో గల గోశాలలో గోపాష్టమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోశాలలో గోపూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మఠం రాచయ్య మాట్లాడుతూ.. కార్తీకమాసంలో శుద్ధ అష్టమిరోజు గోపాష్టమిని జరుపుకుంటారన్నారు. గోపాష్టమి సందర్భంగా గోవులను పూజించడం ఎంతో శుభకరమన్నారు. శ్రీకృష్ణుడి తండ్రి నందుడు బృందావనంలోని గోవులను రక్షించే బాధ్యతలను శ్రీకృష్ణుడికి అప్పగించినందుకు ఈ పండుగను జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు రంగయ్య, మల్లికార్జునప్ప, నాగేశ్వర్, బాలబ్రహ్మచారి, సందీప్, రుషికేశ్, దిలీప్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధిపై అవగాహన

కొత్తూరు: ప్రస్తుత ఉరుకులు పరుగుల జీవినంలో చాలామంది జంక్‌ఫుడ్‌ను తింటూ వారికి తెలియకుండానే మధుమేహం బారిన పడుతున్నట్లు జిమ్స్ ఆస్పత్రికి చెందిన హోమియోపతి వైద్యులు తెలిపారు. ఆస్పత్రి దత్తత తీసుకున్న మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు మధుమేహ వ్యాధి నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా సిబ్బంది గ్రామంలోని పలువురికి ఉచితంగా మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంతేకాకుండా వ్యాధి బారినపడే అవకాశం ఉన్న వారితో పాటు మధుమేహంతో బాధపడే వారికి వ్యాధి నియంత్రణకు తీసుకోవాల్సిన ఆహార నియమాలను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యులు పూనమ్‌సుతార్, విరాజిత, హన్మంతు, వైద్య విద్యార్థులు, పంచాయతీ కార్యదర్శి గౌస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

కొందుర్గు: లయన్స్ క్లబ్ ఎవరెస్టు, అబ్దుల్ కలామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం చౌదరిగూడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జయకుమార్, శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ సింగర్ చింతరంజన్‌దాసు, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, జీహెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

తహసీల్దార్ అజాంఅలీ



కొత్తపేటలో ఓటరు లిస్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ అజాంఅలీ

కేశంపేట: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ అజాంఅలీ అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఓటర్ల ప్రత్యేక ప్రచార దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. అందులో భాగంగా మండలంలోని గ్రామాల్లో బీఎల్ఓలు అర్హులైన వారి నుంచి ఫారం 6 ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, కొత్తపేట గ్రామాల్లో తహసీల్దార్ అజాంఅలీ పాల్గొని ఓటర్ల ప్రత్యేక ప్రచార దినోత్సవ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం అయన మాట్లాడుతూ.. ఓటరు లిస్టులో మార్పులు, చేర్పులతో పాటు నూతనంగా అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రజలతో కలిసి ఓటర్ల ప్రత్యేక ప్రచార దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఎల్ఓలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్



సమావేశంలో పాల్గొన్న చైర్మన్ పెంటయ్యగౌడ్, పాలకవర్గ సభ్యులు

చేవెళ్ల: రైతులకు మేలు జరిగేలా మార్కెట్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జి. పెంటయ్యగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో శనివారం నూతన పాలకవర్గం మొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ పెంటయ్యగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మార్కెట్ అభివృద్ధిపై తీసుకోవాల్సిన కార్యాచరణ అంశాలను పాలకవర్గంతో చర్చించినట్లు తెలిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. రైతులకు ఉపయోగపడే విధంగా ఉండేలా కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటు, అవసరమైన సీసీరోడ్లు, కొత్తగా 10 దుకాణాల నిర్మాణాలు, మార్కెట్ చుట్టూ ప్రహరీ నిర్మాణం, సీసీ కెమెరాల ఏర్పాటు, కూరగాయల కవర్‌షెడ్ నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం తదితర పనులు చేపట్టాలని పాలకవర్గం తీర్మానం చేసి ఆమోదించినట్లు తెలిపారు. ఒక్కొక్కటిగా మార్కెట్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి అభివృద్ధి చేస్తామని చెప్పారు. నిరంతరం రైతులకు అందుబాటులో ఉండి రైతులకు కావాల్సిన సేవలను అందిస్తామన్నారు. మార్కెట్‌లో రైతులు ఎదుర్కొనే సమస్యలను మార్కెట్ కమిటీ దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతుల కోసమే మార్కెట్ కమిటీ పనిచేస్తోందని తెలిపారు. అందరి భాగస్వామ్యంతో చేవెళ్ల మార్కెట్‌ను మొదటిస్థానంలో నిలుపుదామన్నారు. రైతు బజారును కూడా త్వరలోనే ఉపయోగంలోకి తీసుకొచ్చే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ బి.రాములు, డైరెక్టర్లు, మల్లేశ్, జనార్దన్, నరేందర్, సత్యనారాయణ, హనీఫ్, యాదిరెడ్డి, యాదయ్య, బాలయ్య, సుదర్శన్, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మార్కెట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



షాబాద్: చర్లగూడలో ప్రజలకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

షాబాద్: ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చర్లగూడ మాజీ సర్పంచ్ కొకుంట్ల పుష్పమ్మ, సీనియర్ నాయకుడు రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చర్లగూడ గ్రామంలో చేవెళ్లకు చెందిన పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో 350 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రజలు ఆరోగ్యం విషయంలో వైద్యుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ, గ్రామస్తులు ఆంజనేయులు, సత్యనారాయణరెడ్డి, సుధాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పూజలో పాల్గొన్న స్వాములు

చేవెళ్ల: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా అయ్యప్ప మాలధరించిన స్వాములు ఆలయంలో శనివారం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. స్వాములు అయ్యప్ప భక్తి పాటలతో అలరించారు. దేవాలయంలో ప్రధాన అర్చకుడు కిరణ్‌కుమార్, అయ్యప్ప గురుస్వాములు కృష్ణపంతులు, తదితరుల ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి


ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి ఆవరణలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆపదలో వచ్చే రోగులకు వైద్యులు దైవంతో సమానమన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో ఆప్యాయంగా, ప్రేమతో మాట్లాడాలన్నారు. సౌకర్యాలు లేవంటూ వేరు ఆస్పత్రులకు రెఫర్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా వైద్యులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. ప్రభుత్వం నిరుపేదల ఆరోగ్య సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. ప్రభుత్వ ఆశయాలకనుగుణంగా వైద్యులు క్షేత్రస్థాయిలో పని చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వం వైద్యపరంగా అందజేసే పథకాలను అర్హులైన వారికి అందించాలన్నారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, డాక్టర్ చంద్రశేఖర్, నాయకులు బాబర్‌ఖాన్, ఖాదీర్, తదితరులు పాల్గొన్నారు

బెల్టు దుకాణాలు మూసివేయాలని వినతి



కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్‌రూరల్: ప్రజల ఆరోగ్య, ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్న బెల్టు దుకాణాలను మూసివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చౌడమ్మగుట్టతండా గ్రామపంచాయతీ వాసులు శనివారం కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో నిరుపేద కుటుంబాలకు చెందిన వారు ఉన్నారని, గ్రామస్తులందరూ రోజు కూలీపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రతిరోజు వచ్చిన కూలీ డబ్బులు బెల్టు దుకాణాల్లోనే ఖర్చు చేస్తున్నారని, దీంతో కుటుంబ పోషణ భారంగా మారుతుందన్నారు. గ్రామంలో బెల్టుషాపులు ఉండటంతో ఎప్పుడు పడితే అప్పుడు మద్యం తాగుతూ మద్యానికి బానిసలుగా మారుతున్నారన్నారు. బెల్టు షాపు నిర్వాహకులు ఇష్టానుసారంగా మద్యం విక్రయిస్తున్నారని, ఉదయం 5గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు మద్యం అమ్ముతున్నారని ఆరోపించారు. చిన్నాపెద్దా, ఆడ, మగ తేడా లేకుండా ప్రతిఒక్కరికి మద్యం అమ్ముతున్నారన్నారు. గ్రామంలో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో లింగం, కిషన్, రమేశ్, కృష్ణ, దేవుజానాయక్, గోపాల్, జగన్, రాము, రమేశ్ ఉన్నారు.